
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

బుధవారం 20 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు


ఇఫ్తార్ (బుధ) సా.6.23

సహరీ (గురు) ఉ.4.46

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	35	27

వైసీపీకి 'వలంటీర్'గా..



- ఎన్నికలు సమీపించడంతో అడ్డంగా బరితెగించేస్తున్న వలంటీర్లు
- వైసీపీ నేతల ఆదేశాలతో కోడ్ ఉల్లంఘించి ఇంటింటికీ వెళ్లి ప్రచారం
- పార్టీ నేతల కార్యక్రమాల్లోనూ నేరుగా పాలుపంచుకుంటున్న వైనం
- అటు ఎన్నికల కోడ్ ఉన్నా వైసీపీ అభ్యర్థుల రహస్య సమావేశాలకు హాజరు
- అధికార పార్టీ నేతల నుంచి గిఫ్టులు, ఫోన్‌లు, నగదు, వెండి గిన్నెలు స్వీకరణ
- తమను గెలిపిస్తే ఒక్కొక్కరికి రూ.లక్ష ఇస్తామంటూ పలువురు అభ్యర్థుల ఆఫర్లు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వలంటీర్లపై భారీగా వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేకమంది వలంటీర్లు ఇంకా వైసీపీ సేవలోనే తరిస్తున్నారు. అధికారపార్టీ నేతల ప్రలోభాలకు తలొగ్గి వారి కోసం యథేచ్ఛగా పనిచేస్తున్నారు. నేరుగా వారి ప్రచార కార్యక్రమాలకు హాజరవడం దగ్గర నుంచి తమ పరిధిలో ఇంటింటికి వెళ్లి వైసీపీకి ఓటేయాలంటూ యథేచ్ఛగా అడిగేస్తున్నారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో విధులకు దూరంగా ఉండాల్సి ఉన్నా అదేం ఖాతరు చేయడం లేదు. నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు అన్ని విధాలా అండాదండా అందిస్తున్నారు. ఇదే అదనుగా ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం పార్టీ కార్యకర్తలకు బదులు వీరిపైనే ఆధారపడి వారిని ఆర్థికంగా బాగా సంతృప్తిపరుస్తున్నారు. కాకినాడ జిల్లాలో అయితే పార్టీని గెలిపించుకుంటే ఎన్నికలయ్యాక ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నగదు ఇస్తామంటూ నేరుగా ఆఫర్లు కూడా ఇస్తున్నారు. దీంతో ఇప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఎక్కడచూసినా వేలాదిమంది వలంటీర్లు అధికార వైసీపీ కోసం నేరుగా రంగంలోకి దిగి పనిచేస్తున్నారు. యథేచ్ఛగా కోడ్‌ను ధిక్కరిస్తున్నారు. ఈనేపథ్యంలో వీరిపై ఉమ్మడి జిల్లా నుంచి భారీగా ఈసీకి ఫిర్యాదులు కూడా వెళ్లాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా వలంటీర్ల వ్యవస్థను ప్రారంభించింది. ఒక్కో వలంటీర్‌కు గౌరవం వేతనం ఇస్తూ ప్రతి యాభై కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పర్యవేక్షణ, పింఛన్ చెల్లింపులకు వీరిని వినియోగిస్తోంది. అయితే వీరు ప్రభుత్వ ఉద్యోగులు కానందున ఇప్పుడు ఎన్నికల కోడ్ రావడంతో పక్కకు తప్పుకోవాల్సి ఉంది. ఎలాంటి ప్రభుత్వ విధులు, ఎన్నికల విధులు, అధికార పార్టీ అభ్యర్థుల కోసం ప్రచారాలు చేపట్టకూడదు. కానీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వేలాదిమంది వలంటీర్లలో సింహభాగం మంది నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి వారితో రహస్య సమావేశాల్లో పాల్గొంటున్నారు. అలాగే అభ్యర్థుల ఆదేశాలతో తమ పరిధిలో కుటుంబాల వద్దకు వెళ్లి నిబంధనలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. ఇందుకుగాను వీరికి వైసీపీ అభ్యర్థులు భారీ ఆఫర్లు ఇస్తున్నారు. ఇప్పటికే కాకినాడ జిల్లాలోని తుని, పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, జగ్గంపేట తదితర నియోజకవర్గాల్లో వలంటీర్లకు అధికార పార్టీ నేతలు ఖరీదైన సెల్‌ఫోన్లు, వాచీలు, ఇతర గిఫ్టులు అందించారు. తమను గెలిపిస్తే ఎన్నికలు అయ్యాక రూ.లక్ష చొప్పున ఇస్తామంటూ ఆఫర్లు ఇచ్చారు. దీంతో ఎక్కడికక్కడ వలంటీర్లు యథేచ్ఛగా బరితెగించేస్తున్నారు. అభ్యర్థులు, వారి అనుచరులు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారాలు, సమావేశాలకు నేరుగా హాజరవుతున్నారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీకి ఓటేయాలంటూ ప్రజలపై ప్రలోభాల వల విసురుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ వలంటీర్ల తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్న వీరిపై చర్యలు తీసుకోవాలంటూ ఇప్పటికే ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు వందల్లో ఫిర్యాదులు పంపాయి. ఇప్పటికే తునిలో వలంటీర్ల తీరుపై ఈసీకి ఫిర్యాదులు వెళ్లడంతో చర్యలకు రంగం సిద్ధమవుతోంది.

వైసీపీ సమావేశాలకు హాజరవుతున్న వలంటీర్లు

- ఎలక్షన్ కమిషన్ ఆంక్షలు బేఖాతర్
- రాజమహేంద్రవరం సిటీలో వైసీపీ సమావేశాలకు హాజరవడంపై అర్బన్ ఆర్వో దినేష్‌కుమార్ ఆగ్రహం
- హెచ్చరికలతో సరిపెట్టడంపై విమర్శలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వలంటీర్లు బరితెగిస్తున్నారు. ఎన్నికల సమయంలో వలంటీర్లను వాడుకోవద్దని ఎన్నికల కమిషన్ హెచ్చరించినా పట్టించుకోవడం లేదు. అధికార వైసీపీ నేతల ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగి వైసీపీ మీటింగ్‌లకు హాజరవుతున్నారు. అంతేకాక వైసీపీ అభ్యర్థులు కూడా వలంటీర్లతో ఇంటింట ప్రచారం చేయించడానికి, ప్రతి లబ్ధిదారుడికీ రూ.లక్షల్లో లబ్ధి చేకూరినట్టు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేయించడానికి సన్నద్ధం చేశారు. గతంలో జీతం పెంచమని అడిగితే.. సుమారు 100 మందికిపైగా వలంటీర్లను సస్పెండ్ చేసిన అధికారులు, వారిలో మళ్లీ కొంతమందిని విధుల్లోకి తీసుకున్నారు. ఇటీవల వైసీపీ నేతలు నియోజకవర్గాల వారీగా గిఫ్టులు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఇంకా ఎన్నికలు దగ్గరకు వచ్చే సమయంలో డబ్బు కూడా ఇస్తామని ప్రలోభాలు పెట్టి వాళ్ల చేత పనిచేయించుకునే పనిలో ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా సిటీ అభ్యర్థి మార్గాని భరత్ డివిజన్‌ల వారీ బూత్ ఇన్‌చార్జిలతో మీటింగ్‌లు పెడుతూ అక్కడకు వలంటీర్లను కూడా పిలుస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయం బయటకు రావడంతో పాటు రాజమహేంద్రవరం అర్బన్ ఆర్వో, మున్సిపల్ కమిషనర్ దృష్టికి వెళ్లగా సుమారు 20 మందికిపైగా వలంటీర్లను పిలిచి హెచ్చరించడం గమనార్హం. వచ్చే నెలలో పింఛన్లు ఇచ్చే సమయంలో కూడా వలంటీర్లతో నేరుగా ఓటర్లకు వైసీపీకి ఓటు వేయమని చెప్పించడానికి ఆ పార్టీ నాయకులు ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఇక రాజమహేంద్రవరం సిటీలో వైసీపీ నేతల సమావేశాలకు హాజరై, అధికారికంగా అధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ వాళ్లను హెచ్చరించి వదిలేయడం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేననే వాదన మొదలైంది. సిటీలో వైసీపీ అభ్యర్థి పెట్టిన బూత్ కమిటీల మీటింగ్‌లకు హాజరైన సుమారు 20మందికి పైగా వలంటీర్లను మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్న మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ తన దగ్గరకు పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. సస్పెండ్ చేస్తానని, తీవ్ర చర్యలు తప్పవని, పోస్టు నుంచి తీసివేస్తామని హెచ్చరించినట్టు సమాచారం. ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పటికీ, పట్టించుకోకుండా వలంటీర్లు వైసీపీ మీటింగ్‌కు వెళ్లడం ఉల్లంఘనే. అంతేకాదు.. వారి మీద చర్యలు తీసుకోకపోవడం కూడా నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుందని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికే కోనసీమ జిల్లాలో 16 మంది వలంటీర్లను సస్పెండ్ చేశారు. ఇప్పటికైనా వలంటీర్లు బరితెగింపు విధానాలు మానకపోతే ఇబ్బందుల్లో పడక తప్పదు.

వలంటీర్లకు తాయిలాలపై తునిలో విచారణ

తుని రూరల్, మార్చి 19: కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో 1000మందికిపైగా వలంటీర్లకు, కొంతమంది పోలీస్ సిబ్బందికి సెల్‌ఫోన్‌లు పంపిణీ చేశారని, వెలుగు, మెప్మా పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి నగదు పంపిణీ చేశారని ఆరోపిస్తూ టీడీపీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. దీనిపై ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ద్వారా వలంటీర్ల నుంచి వివరణ తీసుకోవాలని ఎంపీడీవోలకు ఆదేశాలు ఇచ్చారు.

16 మంది వలంటీర్లపై వేటు

'సిద్ధం' కార్యక్రమాలకు తామూ సిద్ధమంటూ అత్యుత్సాహం ప్రదర్శించిన వలంటీర్లపై వేటు పడింది. ఎన్నికల కమిషన్ నిబంధనలు బేఖాతరు చేసిన వారిని పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాలతో అంబాజీపేట ఇన్‌చార్జి ఎంపీడీవో కె.వరలక్ష్మి సస్పెండ్ చేశారు. అంబాజీపేట మండలం మొసలపల్లి, ఇరుసుమండల్లో 'సిద్ధం' పేరిట వైసీపీ నాయకులు సోమవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా గ్రామాలకు చెందిన 16 మంది వలంటీర్లు పాల్గొన్నారు. మొసలపల్లిలో కొందరు వలంటీర్లు సీఎం జగన్ జై అంటూ నినాదాలు కూడా చేశారు. వైసీపీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరుతూ ఓటర్ల జాబితాతో ఉన్న 'సిద్ధం' బ్యాగ్‌లను ముఖ్య నేతలు బూత్ కన్వీనర్లకు అందించారు. ఈ ఉదంతంపై మంగళవారం ఆంధ్రజ్యోతి కోనసీమ జిల్లా మెయిన్‌లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించి సస్పెండ్ చేయడంతోపాటు ఎందుకు పాల్గొన్నారో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని వలంటీర్లకు నోటీసులు ఇచ్చారు. - అంబాజీపేట

జగన్ కటౌట్‌పై మాజీ ఎన్నికల కమిషనర్ ఫిర్యాదు



రాష్ట్రంలో ఎన్నికల నియమావళిని అపహాస్యం చేస్తున్నారంటున్నారు రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనరు, సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్. మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం నుంచి పశ్చిమగోదావరి జిల్లా తణుకు కారులో వెళ్తున్న ఆయన్ను ఆలమూరు మండలం జొన్నాడ జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద ఆపి తనిఖీ చేశారు. ఈ సమయంలో ఆయనకు సీఎం జగన్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కటౌట్ ఉన్న పెద్ద హోర్డింగ్ కనిపించింది. మధ్యాహ్నం తిరిగి వెళుతుండగా ఆయన జొన్నాడ వద్ద ఆగి ఆ హోర్డింగ్‌ను మీడియాకు చూపించారు. విషయం తెలుసుకున్న అధికారులు స్పందించి సాయంత్రం హోర్డింగును తొలగించారు. - ఆలమూరు



అమలాపురంలో పదో తరగతి పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

నో మొబైల్ జోన్లుగా పదో తరగతి పరీక్షా కేంద్రాలు

- విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి: ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్, మార్చి 19: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలను ఇప్పటికే నో మొబైల్ జోన్లుగా ప్రకటించామన్నారు. విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు సైతం సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాలకు తీసుకు రాకూడదని సూచించారు. క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలతో పాటు పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పలు కేంద్రాలను మంగళవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బందోబస్తులో ఉన్న పోలీసు సిబ్బంది, ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 30 పోలీసు యాక్టుతో పాటు 144 సెక్షన్ పటిష్టంగా అమలు చేస్తూ పెట్రోలింగ్ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. పరీక్షలు ముగిసే వరకు కేంద్రాల సమీపంలోని జిరాక్సు, ప్రింటింగ్ సెంటర్లను మూసి ఉంచాలని ఆదేశించారు. కేంద్రాలకు ప్రశ్నపత్రాలను తీసుకురావడంతో పాటు పరీక్ష ముగిసిన తర్వాత జవాబు పత్రాలను పోస్టాఫీసులో జమ చేసే వరకు పోలీసు బందోబస్తు నిర్వహించాలన్నారు. మూల్యాంకనం జరిపే కేంద్రాన్ని కూడా ఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, పట్టణ సీఐ కె.క్రిస్టఫర్, స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్ వున్నారు.

రెండో రోజు హిందీ పరీక్ష ప్రశాంతం

ముమ్మిడివరం, మార్చి 19: జిల్లాలో పదో తరగతి పరీక్షలు రెండో రోజైన మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. 112 కేంద్రాల్లో హిందీ పరీక్షకు మొత్తం 13,141 మంది విద్యార్థులకు 18,799 మంది హాజరయ్యారు. 341 మంది గైర్హాజరయ్యారు. ఆర్జేడీ జి.నాగమణి ఐదు, డీఈవో ఎం.కమలకుమారి ఆరు, డీవైఈవో పి.నరసింహ ఫణి ఎనిమిది, అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సురేష్ నాలుగు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది 29 కేంద్రాలను తనిఖీ చేశారు. ఎక్కడా మాస్ కాపీయింగ్, మాల్‌ప్రాక్టీసు చోటు చేసుకోలేదని జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి తెలిపారు.

పాఠశాలల్లోనూ ఎన్నికల కోడ్

ఉప్పలగుప్తం, మార్చి 19: పాఠశాలల్లో ఎన్నికల కోడ్ అమలుపై ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక నియమావళి ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేశారు. రేపర్లు లేకుండా చిక్కీలు పంపిణీ, పాఠశాలల్లో వివిధ పథకాల పోస్టర్ల తొలగింపు, విద్యార్థుల పుస్తకాలకు అట్టలు వేయించడం, ట్యాబ్‌లకు స్టిక్కర్ల తొలగింపు, గోరుముద్ద రంగు తొలగింపు, విద్యార్థులు బెల్టులు ధరించకుండా చూడడం, గోడలపై రాజకీయ పార్టీల పోస్టర్లు తొలగింపునకు చర్యలు తీసుకోవాలి. ఈ నియమాలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ ఉత్తర్వులిచ్చారు.



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

16 మందికి మించి అభ్యర్థులు బరిలో ఉంటే రెండో బ్యాలెట్ యూనిట్

సిద్ధం చేయాలి

- రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచన

అమలాపురం టౌన్, మార్చి 19:

అసెంబ్లీ నియోజకవర్గంలో 16 మందికి మించి అభ్యర్థులు పోటీలో ఉంటే రెండో బ్యాలెట్ యూనిట్‌ను సిద్ధం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం ప్రతికూల వార్తలను గుర్తించి తగు చర్యలు చేపట్టాలన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా వస్తున్న ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా సార్వత్రిక ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. మంగళవారం తొలుత రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా తాడేపల్లి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం రాజకీయ పార్టీల ప్రకటనలు బహిరంగ ప్రదేశాల్లో కటౌట్లు, హోర్డింగుల ద్వారా ఉన్నట్టయితే గుర్తించి తక్షణం తొలగించాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటస్టిక్స్ సర్వేలెన్స్ టీముల మెగా వ్యవస్థను పటిష్టం చేసి డబ్బు, మద్యం, గిఫ్ట్ ఆర్టికల్స్ బల్క్‌గా రవాణా కాకుండా చూడాలన్నారు. ఆధారాలు చూపని వాటిని సీజ్ చేయాలని ఆదేశించారు. పోలింగ్‌కు ఈవీఎంలను సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే ఆయా చిత్రాలను, వీడియోలను లోకేషన్ యాప్‌లో పొందుపరిస్తే అధికారులు వెంటనే చర్యలు చేపడతారన్నారు. స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటర్లలో చైతన్యం తీసుకురావాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, రాజోలు, పి.గన్నవరం, ముమ్మిడివరం, రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మదన్‌మోహనరావు, శ్రీరామచంద్రమూర్తి, ఎస్.సుధాసాగర్, ఎస్వీవీ సత్యనారాయణ, జి.కేశవర్ధనరెడ్డి, డి.ఎల్లారావు, అమలాపురం లోక్‌సభ సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.ఝాన్సీరాణి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ పాల్గొన్నారు.



కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థిగా తంగెళ్ల ఉదయ్

- 7లో

జనసేన ఇన్‌చార్జి జంప్!

- వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డితో శెట్టిబత్తుల రాజబాబు భేటీ
- టిక్కెట్ రాకపోవడంతో వైసీపీలో చేరనున్నారన్న ప్రచారం
- కంఠంలో ప్రాణం ఉండగా జనసేనను వీడేది లేదు: రాజబాబు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు వైసీపీలో చేరతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఉభయ గోదావరి జిల్లాల వైసీపీ కో-ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డితో ఆయన భేటీ కావడమే ఈ ప్రచారానికి బలం చేకూరుస్తోంది. కొన్ని సంవత్సరాలుగా జనసేన అమలాపురం అసెంబ్లీ ఇన్‌చార్జి హోదాలో కొనసాగుతూ పార్టీ కార్యక్రమాలను రాజబాబు సమర్థవంతంగా నిర్వహించేవారు. అమలాపురం ఎస్సీ రిజర్వుడు స్థానాన్ని జనసేనకే కేటాయించాలంటూ ఆయన గత రెండు నెలలుగా జనసేన అధిష్ఠానంపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. ఒక దశలో టిక్కెట్టు జనసేనకే కేటాయించి రాజబాబును అభ్యర్థిగా ప్రకటించారంటూ ఆయన వర్గీయులు అమలాపురం గడియార స్తంభం సెంటర్లో సంబరాలు చేసుకున్నారు. అయితే మారుతున్న సమీకరణాల నేపథ్యంలో పొత్తులో భాగంగా అమలాపురం అసెంబ్లీ సీటును ఎట్టి పరిస్థితుల్లోనూ టీడీపీకే కేటాయించే అవకాశాలు ఉన్నాయన్న పరిస్థితిలో జనసేన ఇన్‌చార్జి రాజబాబు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. సోమవారం రాత్రి ఆయన తాడేపల్లిలోని ఎంపీ మిథున్‌రెడ్డి ఇంటికి వెళ్లినట్టు తెలిసింది. సుమారు గంటన్నరసేపు పలు విషయాలపై చర్చించి తన మనోవేదనను ఆయనకు తెలిపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. రాజబాబు మిథున్‌రెడ్డి ఇంటి లోపల డైనింగ్ హాలులో కూర్చున్న ఫొటోలతో పాటు ఇంటి నుంచి బయటికి వస్తున్న వీడియోలు, వేసుకెళ్లిన కారు సమాచారాన్ని వీడియోల రూపంలో కొందరు అగంతకులు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ వీడియోలతో పాటు భేటీ సమాచారం జనసేన అధిష్ఠానం దృష్టికి కూడా వెళ్లినట్టు తెలిసింది. వైసీపీలో చేరికకు రాజబాబు సుముఖత వ్యక్తం చేసినట్టు.. వైసీపీ అధినేత జగన్ దృష్టికి తీసుకువెళ్లి ఆయన సూచన మేరకు రెండు, మూడు రోజుల్లో సమాచారం పంపిస్తామని మిథున్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు తెలిసింది. దాంతో రాజబాబు అక్కడి నుంచి వెనుదిరిగారు. దీనిపై జనసేనలోని వైరి వర్గంతో పాటు మిగిలిన నాయకులు, టీడీపీ నేతలు అవాక్కయ్యారు. కాగా తన కంఠంలో ప్రాణం ఉండగా జనసేన పార్టీని గానీ, పవన్‌కల్యాణ్‌ను గానీ వీడే ప్రసక్తే లేదంటూ రాజబాబు ఒక వీడియో సందేశంలో వివరణ ఇచ్చారు. కావాలనే కొందరు వ్యక్తులు తాను వైసీపీలోకి వెళ్లిపోతున్నానంటూ దుష్ప్రచారం చేస్తూ మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని ఆవేదన చెందారు.





మిథున్‌రెడ్డి ఇంటి నుంచి బయటకి వస్తున్న రాజబాబు (ఎడమ), మిథున్‌రెడ్డి నివాసంలో... (కుడి)



పి.గన్నవరం హైస్కూల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న దృశ్యం

ఆ విద్యార్థులకు వీల్ చైర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పి.గన్నవరం, మార్చి 19: పి.గన్నవరంలోని పదో తరగతి పరీక్షా కేంద్రం వద్ద ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు వీల్ చైర్ ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం వద్దకు విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఎత్తుకుని తీసుకొస్తూ పడుతున్న కష్టాలపై 'మేమున్నామని' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులను వీల్ చైర్‌లో కూర్చోబెట్టి గది వద్దకు తీసుకెళ్తున్నారు. మొదటి రోజు మాదిరిగా రెండో అంతస్తులో కాకుండా గ్రౌండ్ ఫ్లోర్ గదుల్లో పరీక్ష రాసేలా మార్పులు చేశారు.

అడ్డగోలుగా...

- మందపల్లి రీచ్‌లో నదీగర్భంలో ఇసుక తవ్వకాలు
- పర్యావరణ అనుమతులతో పనేలేదు
- కన్నెత్తి చూడని పోలీసు, రెవెన్యూ, మైన్స్ అధికారులు



కొత్తపేట, మార్చి 19: కొత్తపేట మండలం మందపల్లిలో (ఆలమూరు-2 పేరిట) నిర్వహిస్తున్న రీచ్‌లో నదీగర్భంలో ఇసుక తవ్వకాలు అడ్డగోలుగా సాగుతున్నాయి. విజయవాడకు చెందిన ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో సాండ్ వే బిల్లులు ఇస్తూ నిత్యం వందలాది లారీలతో ఇసుక రవాణా సాగుతోంది. అయితే దీనికి సంబంధించి ఈ కంపెనీకి ఎంత కాలానికి అనుమతులు ఉన్నాయి... ఎన్ని క్యూబిక్ మీటర్లు ఇసుక తవ్వుకోవచ్చు... పర్యావరణ అనుమతులు ఉన్నాయా అనేది అంతు చిక్కని ప్రశ్నగా ఉంది. ర్యాంపులను ఎవరు నిర్వహిస్తున్నారో తెలియనప్పటికీ సంబంధిత పోలీసు, రెవెన్యూ, మైన్స్ శాఖల అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. గత ప్రభుత్వాల్లో కనీసం జవాబుదారీతనం ఉండేదని, వైసీపీ హయాంలో కళ్లెదుటే దోపిడీ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వారి చెప్పిందే రేటు అన్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మందపల్లి ర్యాంపులో సోమవారం ఇసుక కొనుగోలు చేసి, వారిచ్చిన వే బిల్లులుతో వినియోగదారులకు రవాణా చేస్తుంటే అయినవిల్లి పోలీసులు ఆపి ఆరు వాహనాలను సీజ్ చేశారని లారీల యజమానులు ర్యాంపు నిర్వాహకులతో మంగళవారం వాగ్వివాదానికి దిగారు. తాము వేలాది రూపాయలు చెల్లించి ఇసుక కొనుగోలు చేస్తే మీరిచ్చిన వే బిల్లులు (నకిలీవని) చెల్లవంటూ పోలీసులు లారీలను నిలుపుదల చేశారన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ర్యాంపులో ఇసుక లోడ్ చేయడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీంతో చేసేదేమీ లేక నిర్వాహకులు అయినవిల్లి పోలీసులను సంప్రదించారు. పై స్థాయిలో పైరవీలు జరిగిన తర్వాత ఎట్టకేలకు లారీలను విడిపించారు. వేలకు వేలు చెల్లించి ఇసుక కొనుగోలు చేసినప్పటికీ తమకు ఇబ్బందులు తప్పట్లేదని వైసీపీ ప్రభుత్వ తీరుపై వినియోగదారులు మండిపడుతున్నారు.

ప్రతిమా కంపెనీ పేరిట ఇచ్చిన వే బిల్లులను చూపుతున్న లారీల యజమాని





నరసన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నేడు కల్యాణోత్సవం.. రథోత్సవం

ధ్వజపతాన్ని ఎగురవేస్తున్న దృశ్యం





కోరుకొండ, మార్చి19: శతాబ్దాల చరిత్ర కలిగిన నవ నరసింహ క్షేత్రాల్లో ఒకటైన స్వయంభు కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఫాల్గుణ శుద్ధ దశమి మంగళవారం సాయంత్రం పుట్టమన్ను తీసుకు రావడంతో నరసన్న బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ప్రత్యేక పల్లకిలో ఆశీనులు గావించి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య పుట్టమన్ను తీసుకురావడానికి అనువంశిక ధర్మకర్త ఎస్పీ రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో శ్రీ చక్రపెరుమాళ్లను తీసుకుని దేవుని కోనేరు వద్దకు వెళ్లారు. అక్కడ పవిత్రమైన పుట్టకు శాస్త్రోక్తంగా వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం ఆగమ బ్రహ్మ పాణింగిపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుట్ట మన్ను సేకరించారు. పుట్టమన్ను తీసుకుని తిరిగి మంగళవాయిద్యాలతో లక్ష్మీనరసింహస్వామి దిగువ దేవస్థానం ఆలయ ముఖ మండపానికి చేరుకున్నారు. అక్కడ ఈ పుట్టమన్నును 9 రకాల మట్టి మూకిడిలో వేసి నవధాన్యాలు వేసి నరసన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం స్వామి వారి ధ్వజ పతాన్ని ధ్వజ స్తంభం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం చేశారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఎస్పీ రంగరాజభట్టర్, లక్ష్మీనరసింహభట్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, ఎంపీటీసీ కాళ్ల వీరబాబు, వైస్ ఎంపీపీ బొరుసు నాగమణి, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ తాడి రజనీ, మరో ట్రస్టు మెంబర్ కటకం బాబ్జి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బొండాడ చందు పాల్గొన్నారు.



కల్యాణానికి వేళాయె..

కోరుకొండ, మార్చి19: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్య దంపతులకు, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ అనంత పద్మనాభ స్వామి వారికి బుధవారం రాత్రి 9 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఆగమ పండితులు పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో వంశ పారంపర్య అర్చక స్వాములు పెదపాటి, పెద్దింటి, పెరవళి స్వీయ పర్యవేక్షణలో పాంచాహ్నిక దీక్షతో శ్రీ వైఖానస ఆగమ వైష్ణవ సంప్రదాయంలో అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. వంశపారంపర్య ధర్మకర్త పరాసర భట్టర్ వంశీయులు, ఎస్పీ రంగ రాజభట్టర్, అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కోరుకొండ దిగువ దేవస్థానం ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణ వేదికపై శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం, లోక కల్యాణార్థం, భక్తజన సంరక్షణార్థం జరిపించనున్నట్లు రంగరాజభట్టర్ స్వామి తెలిపారు.భక్తులందరి స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలను కనులారా తిలకించి స్వామి వారి కృపాకటాక్షలకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

పండిత సభలు

రంగరాజస్వామివారి ఆలయ ప్రాంగణంలో విశిష్టాద్వైత పండిత సభలు ప్రారంభమవుతాయి. 5 రోజులు పాటు ఉభయ వేదాంత పండితులు ఉదయం, సాయంత్రం ఈ పండిత సభల్లో పాల్గొని భక్తులకు రామాయణ, భాగవత ఆళ్వారుల దివ్య చరిత్ర గురించి ఉపన్యాసిస్తారు. ఈ కార్యక్రమాలు పరాసర లక్ష్మీనరసింహ భట్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

రథోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

చారిత్రాత్మక కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలు సందర్భంగా కల్యాణానికి ముందు బుధవారం మధ్యాహ్నం 1.58 గంటలకు స్వామి వారి రథోత్సవం జరుగుతుంది.అంతకుముందు స్వామి వారిని పెండ్లి కుమారుడిగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి పండితులు నిర్ణయించిన శుభ ముహూర్తానికి పల్లకిపై తీసుకుని వచ్చి స్వామి వారి అతిపెద్ద పురాతన రథంపై స్వామి ఆశీనులు గావిస్తారు. అనంతరం రథానికి ముందు పూజలు చేస్తారు. తదుపరి అన్నాన్ని రాశిగా పోసి గుమ్మడికాయ కొట్టి రథాన్ని ముందుకు లాగుతారు. దీంతో రథోత్సవం ప్రారంభమవుతుంది. సుమారు 4 గంటలు పాటు కోరుకొండ నాలుగు మాడ వీధుల్లో వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణల మధ్య లక్షలాది అరటిపండ్లు రథంపై వేస్తుంటే రథం ముందుకు సాగుతుంది.

సాగర తీరంలో డాల్ఫిన్ల సందడి



సర్పవరం జంక్షన్, మార్చి 19: కాకినాడ సాగర తీరంలో డాల్ఫిన్లు సందడి చేస్తున్నాయి. సముద్ర తీరానికి సమీపంలో సముద్రం పై భాగంలో ఇవి పైకి తేలియాడుతూ..గాలిలోకి ఎగురుతూ చక్కర్లు కొట్టే విన్యాసాలు సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక ప్రదేశంగా కాకినాడ బీచ్‌కు గుర్తింపు ఉంది. కాకినాడ సాగర తీరంలో సూర్యారావుపేట, నేమాం సముద్ర తీరంలో డాల్ఫిన్లు సందడి చేస్తున్నాయి. నిత్యం సుమారు 10 నుంచి 12 డాల్ఫిన్లు సముద్ర తీరానికి వచ్చి సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. డాల్ఫిన్లు సముద్రపు నీటి, నదీ జలాల్లో నివసించే క్షీరదాలు. ఇవి చూసేందుకు ఎంతో ముద్దుగా ఆహ్లాదంగా కనిపిస్తాయి. డాల్ఫిన్లు మనుషులతో దగ్గరగా ఎంతో కలుపుగోలుగా ఉంటాయి. వీటికి మనిషి మాదిరిగా తెలివితేటలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు తమ అధ్యయనాల్లో పొందుపరిచారు. ఇవి సముద్రంలో నివసిస్తూ అనుకూలమైన వాతావరణం ఉన్న సమయంలో సముద్ర తీరానికి వచ్చి సముద్రంలో పైకి వింత వింత శబ్దాలతో అరుస్తూ ఎగురుతూ విన్యాసాలు చేస్తుంటాయి. అరుదుగా కనిపించే డాల్ఫిన్లను చూసేందుకు బీచ్‌కు సందర్శకులు తరలివస్తున్నారు. గత వారం రోజులుగా కాకినాడ బీచ్‌లో సముద్ర తీరంలో డాల్ఫిన్లు సంచరించడంతో వీటి విన్యాసాలు చూసి ఫొటోలు తీసుకుంటున్నారు. మత్స్యకారులు అయితే సముద్రంలో ఈత కొడుతూ డాల్ఫిన్ల వద్దకు వెళ్లి వాటితో విన్యాసాలు చేయడం విశేషం. చిన్నారులు, పెద్దలకు ఆహ్లాదం, వినోదం అందించి అరుదైన డాల్ఫిన్లు ఇటీవల మృతి చెందుతున్నాయని సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్రంలో విపరీతమైన కాలుష్యం పెరిగిపోవడం, చేపల వేట కోసం మత్స్యకారులు వినియోగించే మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్ల ఇంజన్ రెక్కల్లో పడి డాల్ఫిన్లు మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరుదైన డాల్ఫిన్ల సంరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం

అంతర్వేది, మార్చి 19: అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ కొంపల్లికి చెందిన కూనపరాజు సూర్యావతి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పొత్తూరి సుబ్బరాజుఝాన్సీలక్ష్మి రూ.2.71 లక్షలు విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించినట్టు దాతలు తెలిపారు. అనంతరం దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ అధికారులు అందించారు. కార్యక్రమంలో తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలపై సమీక్ష

ఆత్రేయపురం, మార్చి 19: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ కోరారు. ఆలయంలో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. ఏప్రిల్ 18 నుంచి 24 వరకు ఉత్సవాలు జరుగుతాయని, 19న తీర్థం, కల్యాణం, రథోత్సవాలను తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారన్నారు. ప్రభుత్వ నోటిఫైడ్ ఫెస్టివల్ కావడంతో చేపడుతున్న ఏర్పాట్లపై ఆర్డీవో శాఖల వారీగా సమీక్షించారు. తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్య సేవలతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు చేపట్టాల్సిన చర్యలు, ట్రాఫిక్, ట్రాన్స్‌పోర్ట్, విద్యుత్ శాఖల అధికారులతో తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. శాఖల వారీగా చేపడుతున్న చర్యలను అధికారులు వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో నిబంధనలకు అనుగుణంగా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ఉప కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్, దేవదాయ శాఖ జిల్లా అధికారి నాగమల్లేశ్వరరావు, డీఎల్‌డీవో రాజేశ్వరరావు, సీఐ రామ్‌కుమార్, తహసీల్దారు వెంకటరామయ్య, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, పరిపాలనాధికారి సురేంద్రరెడ్డి, వైద్యాధికారి సౌమ్య, ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ అచ్యుతాంబ పాల్గొన్నారు.

యువతిని నమ్మించి, మోసగించిన కేసులో

ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు ఏడేళ్ల జైలు శిక్ష

అమలాపురం రూరల్, మార్చి 19: యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించి ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చిన తర్వాత కట్నం ఆశించి పెళ్లి చేసుకోకుండా మోసం చేసిన కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో ఏడీజే కోర్టు, క్రైమ్ ఎగెనెస్ట్ ఉమెన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు తీర్పు వెలువరించినట్లు పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ మంగళవారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలానికి చెందిన యువతిని వన్నెచింతలపూడికి చెందిన పరమట వెంకటేశ్వర దొరబాబు, అలియాస్ వెంకటదొరబాబు ప్రేమిస్తున్నానని వెంటపడి నమ్మించి శారీరకంగా అనుభవించాడు. కాలక్రమంలో అతడికి సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావడంతో కట్నం ఆశించి ఆ యువతిని మోసం చేసి మరో పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. సమాచారం తెలుసుకున్న యువతి 2019 జనవరి 17న అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు కేసు నమోదు చేయగా అనంతరం వచ్చిన సీఐ జి.సురేష్‌బాబు దర్యాప్తు చేపట్టారు. దొరబాబు సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సమయంలో అనుమతి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. రాజమహేంద్రవరం కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు వాదనలు వినిపించగా దొరబాబుపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎస్.శ్రీధర్ హెచ్చరించారు. ఈ కేసులో నేరం రుజువు చేయడానికి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

గండేపల్లి, మార్చి 19: కాకినాడ జిల్లా గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పోక్సో కేసు నమోదైంది. గండేపల్లి పోలీసుల వివరాల ప్రకారం... గండేపల్లి గ్రామానికి చెందిన ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న ఐదేళ్ల బాలికపై అదే స్కూల్‌కు ఆటోపై రోజు తీసుకెళ్తున్న డ్రైవర్ లైంగిక చర్యకు పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. కాకినాడ దిశా డీఎస్పీ ఆర్.రామచంద్రరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గండేపల్లి పోలీసులు తెలిపారు.

ఆటోలో తరలిస్తున్న రూ.4.50 లక్షలు సీజ్

ద్రాక్షారామ, మార్చి 19: రామచంద్రపురం మండలం నరసాపురపుపేట వద్ద మంగళవారం రాత్రి ఆటోలో తరలిస్తున్న రూ.4.50 లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం స్వాధీనం చేసుకుంది. వాహనాల తనిఖీల్లో భాగంగా కరప వైపు నుంచి రామచంద్రపురం వస్తున్న వాహనంలో సదరు మొత్తం పట్టుబడింది. నగదును రామచంద్రపురం పోలీసులకు అప్పగించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

పూర్వ డీసీహెచ్ఎస్ రమేష్‌కిషోర్‌పై విజిలెన్స్ విచారణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 19: పూర్వ డీసీహెచ్ఎస్ డాక్టర్ టి.రమేష్‌కిషోర్‌పై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రమేష్‌కిషోర్ రాజమహేంద్రవరం డీసీహెచ్ఎస్‌గా పనిచేసిన సమయంలో హాస్పిటల్‌లో మహిళా ఉద్యోగినిలపై వేధింపులకు పాల్పడుతున్నాడని, ఆసుపత్రి ఫండ్స్‌లో అవకతవకలు జరిగాయని గతంలో అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ తరుపున న్యాయవాదులు గొట్టిముక్కల అనంతరావు, ధర్నాల కోట వెంకటేశ్వరావు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణాధికారిగా విజయనగరం డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.గౌరిశంకర రావును నియమించింది. ఈ మేరకు బుధవారం కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విచారణ నిర్వహించనున్నట్టు డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్‌కుమారి పేర్కొన్నారు.

కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థిగా తంగెళ్ల ఉదయ్

- మంగళగిరిలో పార్టీ నేతల సమావేశంలో ప్రకటించిన పవన్
- ఎంపీ అభ్యర్థి ఎవరనేదానిపై సస్పెన్స్‌కు తెర
- స్వయంగా పవన్ బరిలోకి దిగవచ్చని కొంతకాలంగా బలంగా ప్రచారం
- పవన్ పిఠాపురం వైపు మొగ్గుచూపడంతో బరిలోకి దిగే నేతపై ఉత్కంఠ
- ఎట్టకేలకు తంగెళ్ల వైపు మొగ్గు..సానాకు దక్కని చాన్స్



పవన్‌కల్యాణ్, నాగబాబుతో ఉదయ్‌శ్రీనివాస్

(ఆంధ్రజ్యోతి, కాకినాడ): ఎట్టకేలకు సస్పెన్స్ వీడింది. కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి ఎవరనే దానిపై కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, టీ టైం అధినేత తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌ను ఎంపీ అభ్యర్థిగా పవన్ మంగళవారం ప్రకటించారు. వాస్తవానికి కాకినాడ ఎంపీ సీటు నుంచి టీడీపీ అభ్యర్థి బరిలోకి దిగుతారని తొలుత చర్చ జరిగింది. కానీ పొత్తు నేపథ్యంలో టికెట్‌ను జనసేన దక్కించుకుంది. దీంతో పలువురు పోటీకి సిద్ధమైనా అసలు అభ్యర్థి ఎవరనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. స్వయంగా పవన్ బరిలోకి దిగుతారంటూ కొంతకాలం విస్తృతంగా చర్చ నడిచింది. కానీ తాను పిఠాపురం నుంచి పోటీ చేస్తానని పవన్ ఇటీవల ప్రకటించడంతో కొంత గందరగోళానికి తెరపడింది. పిఠాపురం నుంచి టికెట్ ఆశించిన నియోజకవర్గ ఇంఛార్జి తంగెళ్లకు ఎంపీ అభ్యర్థిగా పవన్ చాన్సిచ్చారు. కాగా ఈ సీటును సానా సతీష్ ఆశించారు. కానీ పవన్ మాత్రం తంగెళ్లవైపే మొగ్గు చూపారు.

అక్కడ లేదని..ఇక్కడ చాన్స్

కాకినాడ ఎంపీ స్థానం నుంచి తమ పార్టీ తరఫున అభ్యర్థిని సిద్ధం చేసిన టీడీపీ, తీరా జనసేనతో పొత్తు కుదరడంతో కాకినాడ సీటు వదులుకుంది. దీంతో కాకినాడ ఎంపీ అభ్యర్థిగా ఎవరిని బరిలోకి దించుతారనేదానిపై పెద్ద చర్చ జరిగింది. ఉమ్మడి తూ.గో. జిల్లాలో కాకినాడ పార్లమెంట్ పరిధిలో తమ పార్టీకి బలం ఎక్కువగా ఉందని, సామాజిక సమీకరణాల కోణంలోను ఇక్కడి నుంచి ఎంపీ అభ్యర్థిని ఎవరిని నిలబెట్టినా విజయం సాధిస్తామనే అంచనాలు జనసేనలో నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పొత్తులో భాగంగా ఏరి కోరి కాకినాడ ఎంపీ సీటును జనసేన ఖాయం చేసుకుంది. దాదాపు అన్ని స్థానాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులపై స్పష్టత వచ్చినా కాకినాడ ఎంపీ అభ్యర్థి ఎవరనేదానిపై చాలా కాలంగా స్పష్టత లేకుండా పోయింది. బీజేపీతో పొత్తు కుదిరిన నేపథ్యంలో ఆ పార్టీ ఒత్తిడి మేరకు పవన్ ఎంపీగా బరిలోకి దిగవచ్చని ప్రచారం జరిగింది. అదే సమయంలో పిఠాపురం సీటును కూడా పొత్తులో భాగంగా దక్కించుకున్న జనసేన ఇక్కడ కూడా అభ్యర్థి ఎవరనేదానిపై తేల్చలేదు. దీంతో కాకినాడ ఎంపీ, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థులు ఎవరనేదానిపై సస్పెన్స్ నెలకొంది. ఈరెండు స్థానాల్లో పవన్ బరిలోకి దిగొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. మరోపక్క పిఠాపురం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తంగెళ్ల శ్రీనివాస్ తాను ఇక్కడి నుంచి బరిలో ఉంటానని గతంలో పవన్‌కు స్పష్టత ఇచ్చారు. దీంతో పిఠాపురం నుంచి తంగెళ్ల, ఎంపీ అభ్యర్థిగా పవన్ బరిలో ఉండొచ్చనే విశ్లేషణలు జనసేనలో కొనసాగాయి. కానీ ఇటీవల అనూహ్యంగా పవన్ తాను పిఠాపురం నుంచి బరిలో ఉంటానని స్వయంగా ప్రకటించారు. దీంతో ఈ స్థానం ఆశిస్తోన్న తంగెళ్లకు చాన్స్ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో మంగళవారం తంగెళ్లను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. దీంతో కొంతకాలంగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడ్డట్లయింది. కాగా ఎంపీ అభ్యర్థిగా పవన్ ప్రకటించిన ఉదయ శ్రీనివాస్ కడియం ప్రాంతానికి చెందిన నేత. టీ టైం అధినేతగా ఉంటూ గతేడాది జనసేనలో చేరారు. పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలో వారాహి యాత్ర నిర్వహించిన అనంతరం తంగెళ్లను ఇన్‌చార్జిగా నియమించారు. కాగా మంగళవారం మంగళగిరిలో పిఠాపురం నియోజకవర్గం నుంచి వివిధ పార్టీల నాయకులు పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పవన్ తంగెళ్లను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. తాను బరిలో ఉండాల్సిందేనని, కానీ ఎందుకు పిఠాపురం వెళ్లాల్సి వచ్చిందనేదానిపైనా పవన్ స్పష్టత ఇచ్చారు. బీజేపీ కేంద్ర నాయకత్వం తనను ఎంపీగా పోటీ చేస్తావా, ఎమ్మెల్యేగా వెళ్తావా అని అడిగారని ఎమ్మెల్యేగా పోటీ చేసి అసెంబ్లీలో అడుగుపెడతానని చెప్పానని, ముందు రాష్ట్రానికి తర్వాత దేశానికి సేవ చేయాలని ఉందని వివరించానంటూ తన అంతరంగాన్ని ప్రకటించారు.

ఇక ఎన్నికల రణమే..

కాకినాడ ఎంపీ అభ్యర్థిగా టీడీపీ తరఫున బరిలోకి దిగడానికి గతేడాది నుంచి కాకినాడకు చెందిన వ్యాపారవేత్త సానా సతీష్ ప్రయత్నాలు చేశారు. లోకేశ్ యువగళం పాదయాత్ర, చంద్రబాబు రా.. కదలిరా సభల్లోను ఆయన అన్నివిధాలా ముందుండి పనులు చక్కబెట్టారు. కానీ కాకినాడ ఎంపీ సీటును పొత్తులో భాగంగా జనసేనకు ఇవ్వాల్సి రావడంతో సతీష్ రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. టికెట్ జనసేనకు వెళ్లినా అభ్యర్థిని మాత్రం తానే అవుతానని సానా ఇంతకాలం భావించారు. కొంతకాలం కిందట పవన్‌ను కలిసి తన మనసులో మాట చెప్పారు. త్వరలో తన పేరు కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి లిస్ట్‌లో ఉంటుందని భావించారు. కానీ సీటు తంగెళ్లను వరించింది. కాకినాడ పార్లమెంటు పరిధిలో కాకినాడ అసెంబ్లీ మినహా మిగిలిన ఆరు స్థానాల్లో తెలుగుదేశం, జనసేన పార్టీ అభ్యర్థులపై ఇప్పటికే స్పష్టత రావడంతో ఇక కదన రంగంలోకి ఇరుపార్టీల నేతలు వెళ్లనున్నారు. ఇప్పటికే తుని, జగ్గంపేట, పెద్దాపురం, ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థులు యనమల దివ్య, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, వరుపుల సత్యప్రభలు, కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ పార్టీల నుంచి భారీ చేరికలతో పాటు ప్రజలకు వద్దకు వెళ్లి మద్దతు కూడగట్టడంలో నిమగ్నమయ్యారు. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేయనుండడంతో ఆ ప్రభావం ఏడు నియోజకవర్గాలపై ఉంటుందని భావిస్తున్నారు.

స్కూల్ బస్సు ఢీకొని అంగన్‌వాడీ చిన్నారి మృతి

దివాన్‌చెరువు, మార్చి 19 : రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలచర్ల గ్రామంలో ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న బండి శ్రీవల్లి(4) అనే చిన్నారి మృతి చెందింది. మంగళవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారి మధ్యాహ్నం భోజన సమయంలో మరో ఇద్దరు చిన్నారులతో కలసి ఆయా సహాయంతో మూత్ర విసర్జనకు బయటకు వచ్చింది. బాలిక వెంట వచ్చిన ఇద్దరు చిన్నారులు ముందుగా మూత్ర విసర్జన అనంతరం కేంద్రానికి బయలుదేరి వెళ్లడంతో వారికోసం ఆయా చిన్నారి శ్రీవల్లీని వదిలి ముందుకు వెళ్లింది. ఈ నేపథ్యంలో అటుగా అతివేగంగా వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్ శ్రీవల్లీని ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం రాజమండ్రిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈమేరకు ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల భారంతో ఉరేసుకుని ఆత్మహత్య

రాజానగరం, మార్చి 19 : అప్పుల భారంతో మండలంలో నరేంద్రపురం గ్రామానికి చెందిన మద్దూరి శ్రీను(47) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన శ్రీను గతంలో ఫ్రూట్స్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఫైనాన్స్ ద్వారా వరికోత యంత్రాన్ని కొనుగోలు చేశాడు. దీనికితోడు ఇంటి నిర్మాణం, కుమార్తె వివాహం చేసి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో అప్పుల భారం అధికం కావడం, తీర్చే మార్గం లేకపోవడంతో కొంతకాలంగా కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. కుమార్తె నిండు గర్భిణి కాగా కుమారుడు తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. దీంతో మనస్తాపం చెందిన శ్రీను చేసేది లేక మంగళవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలాన్ని రాజానగరం పోలీసులు పరిశీలించి, పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజానగరం సీఐ పి.కాశీవిశ్వనాథ్ తెలిపారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ.5.07 లక్షల విలువైన పెట్రోల్, డీజిల్ స్వాధీనం



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

అమలాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి)/రాయవరం: విజిలెన్స్ అధికారులు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం గ్రామంలోని శ్రీవీరవెంకట సత్యనారాయణ సామిల్ అండ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. నయారా ఎనర్జీ లిమిటెడ్ ఫ్రాంఛైజ్ వారితో ఒప్పందాన్ని రద్దు చేసుకున్న తర్వాత కూడా అదే పేరుతో డీలర్ స్టాకును విక్రయిస్తున్నాడు. అంతే కాకుండా నయారా ఎనర్జీ లిమిటెడ్ ఫ్రాంఛైజ్ రద్దు విషయం జాయింట్ కలెక్టర్ దృష్టికి కూడా తీసుకురాలేదు. పెట్రోల్ బంకులోని ఎయిర్ మిషన్ పనిచేయట్లేదు. అగ్నిమాపక యంత్రాలు రీఫిల్ చేయలేదు. సివిల్ సప్లయ్స్ అధికారులు ఆ బంకు నుంచి రెండు నమూనాలను విశ్లేషణ నిమిత్తం సేకరించారు. ఒప్పందం రద్దు చేసుకున్న తర్వాత కూడా డీలర్ స్టాకును విక్రయిస్తున్న కారణంగా, స్టాకు రిజిస్టర్ నిర్వహించకపోవడంతో రాయవరం సివిల్ సప్లయిస్ అధికారులు రూ.5,07,715 విలువ గల 3158 లీటర్ల పెట్రోలు, 1686 లీటర్ల డీజిల్ స్టాకును స్వాధీనం చేసుకుని బంకు యాజమాన్యంపై 6(ఎ) కేసు నమోదు చేసినట్టు విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పెట్రోలు బంకుల యజమానులు అనుమతులు లేకుండా అమ్మకాలు జరిపినా, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిచారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలనాయుడు, నాగవెంకటరాజు, విజయ్‌కుమార్, అలీషా పాల్గొన్నారు.

వైసీపీ నాయకులపై కేసు నమోదు

ద్రాక్షారామ, మార్చి 19: రామచంద్రపురం మండలం వెలంపాలెంలో ఎన్నికల నియమావళి ఉల్లంఘించి గ్రామ సచివాలయంలో సమావేశం జరపడంపై ఎంపీడీవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. వెలంపాలెం సర్పంచ్ భర్త టేకుమూడి సత్యనారాయణ మరో 9 మంది వైసీపీ నాయకులు గ్రామ సచివాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశమయ్యారు. వెలంపాలెం ఎంసీసీ సభ్యులు వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసులు ఎన్నికల నియమావళి అమలులో ఉన్నదని చెప్పినప్పటికీ సమావేశం కొనసాగించారు. దీనిపై ఎంసీసీ సభ్యులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేయగా ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ద్రాక్షారామ ఇన్‌చార్జి ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

అంబాజీపేట, మార్చి 19: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ముక్కామల, అంబాజీపేట, పుల్లేటికుర్రు తదితర గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ తనిఖీలు నిర్వహించారు. స్క్వాడ్ అధికారి, పంచాయతీ కార్యదర్శి జీజీవీకే కుమార్, పోలీస్ కానిస్టేబుల్ శ్రీధర్‌లు కార్లు, వివిధ వాహనాలను తనిఖీ చేశారు. అక్రమంగా నగదు, మద్యం, ఇతర తరలింపుపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని తెలిపారు.

భార్య, అత్తమామలపై అల్లుడి దాడి

రాయవరం, మార్చి 19: భార్య, అత్త, మామలపై అల్లుడు దాడి చేశాడు. లొల్లలో ఈనెల6న జరిగిన ఈసంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ధనమ్మ, నారాయణమ్మ తెలిపిన వివరాల ప్రకారం లొల్ల గ్రామానికి చెందిన మేడపాటి ధనమ్మకి వెదురుపాకకు చెందిన మేడపాటి చంద్రశేఖర్ ఏడేళ్ల క్రితం ప్రేమ వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. ధనమ్మ వెదురుపాకలో వలంటీర్‌గా పనిచేస్తుంది. చంద్రశేఖర్ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడుతుండటంతో ధనమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనెల6న చంద్రశేఖర్ లొల్లలో అత్తవారి ఇంటికి వెళ్లి అత్త నారాయణమ్మపైన భార్యపై, అడ్డువెళ్లిన మామ వెంకన్నపై ఇనుపరాడ్‌తో దాడి చేశాడు. వీరు రామచంద్రపురం ఆసుపత్రిలో చికిత్స పొందారు. అల్లుడు నుంచి రక్షణ కల్పించాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

రేపు ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం

మామిడికుదురు, మార్చి 19: మామిడికుదురులోని అంజూ కంటి ఆసుపత్రి ఆవరణలో అంజూ ఐకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ మేనేజర్ పల్లి స్వామి మంగళవారం కోరారు. స్విట్జర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ గ్లకోమా వైద్య నిపుణులు డాక్టర్ ఆండ్రూమెర్మడ్, రెటీనా శస్త్రచికిత్స నిపుణులు తేజ ఉచితంగా వైద్య సేవలందిస్తారని తెలిపారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డుతో వచ్చి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు

అంబాజీపేట, మార్చి 19: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్లను ప్రలోభపెట్టేవిధంగా నగదు, బహుమతులు పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్వోలకు ఎన్నికల నియమావళిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో తహసీల్దారు జె.విమలకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవోట కె.వరలక్ష్మి, డిప్యూటీ తహసీల్దారు నాగపద్మలక్ష్మి, ఆర్ఐ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

రాజోలు, మార్చి 19: ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్ కోరారు. తాటిపాక సెంటర్‌లో ఎన్నికల సంఘం స్వీప్ యాక్టివిటీ కార్యక్రమంలో భాగంగా తాటిపాక సెంటర్‌లో జేసీ నుపూర్‌అజయ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో ఎస్.బాలాజీ, ఈవోపీఆర్డీ భీమారావు, మెడికల్ సిబ్బంది రాజోలు ఎస్ఐ జి.పృథ్వి, సచివాలయ, పంచాయతీ సిబ్బంది మానవహారంగా ఏర్పడి ర్యాలీ నిర్వహించారు. ఓటు విలువ తెలుసుకో.. భవిష్యత్తును కాపాడుకో.. ప్రజాస్వామ్యంలో ఓటేబలమైన ఆయుధమని నినాదాలుచేశారు.

రాజ్యాంగాన్ని మారిస్తే దేశవ్యాప్త ఉద్యమం

అల్లవరం, మార్చి 19: రాజ్యాంగాన్ని మారిస్తే దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని భారత రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ హెచ్చరించారు. కోడూరుపాడులోని గుడ్డివానిచింత వద్ద ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు యల్లమిల్లి అఖిల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆర్పీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెయ్యల పరశురాముడు, రాష్ట్ర కోశాధికారి ఉంద్రు శ్యామలరావు, జంగా రాజేంద్రకుమార్, కుంచే కృష్ణారావు, యలమించిలి రమేష్, కుంచే నాగార్జున పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేస్తామంటున్న వారికి బుద్ధిచెప్పాలి

రాజోలు, మార్చి 19: రాజ్యాంగాన్ని మార్చేస్తామంటున్న బీజేపీ నాయకులకు బుద్ధి చెప్పాలని దళిత నాయకులు పిలుపునిచ్చారు. రాజోలులో దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగిన దళిత సంఘ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చేస్తామంటున్న బీజేపీని ఓడించాలని నాయకులు నినాదాలు చేశారు. బత్తుల జనార్ధనరావు, చిలకపాటి శ్రీధర్, దేవ రాజేంద్రప్రసాద్, నల్లి శ్రీనివాస్, కలిగితి పల్లంరాజు, జిల్లెల్ల వినోద్‌బాబు, తెన్నేటి నాగేశ్వరరావు, కాకర విశ్వనాథం ప్రభాకర్ పాల్గొన్నారు.

పోషణ పక్వాడ

కాట్రేనికోన, మార్చి19: అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలు పోషకాహారం తీసుకోవాలని ముమ్మిడివరం ఐసీడీఎస్ సీడీపీవో ఐ.విమల సూచించారు. మంగళవారం కందికుప్ప సెక్టార్ పరిధిలోని పెదచెరువు అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

టీడీపీ, జనసేన, బీజేపీకే ఎమ్మార్పీఎస్ మద్దతు

ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు జయరాజు


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు దూలి జయరాజుమాదిగ

మండపేట, మార్చి 19: ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉంటామని మాట ఇచ్చిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు దూలి జయరాజుమాదిగ స్పష్టీకరించారు. తర్వాణీపేట వీధిలోని మహాజన సోషలిస్టు పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని గమనించి ఎస్సీ వర్గీకరణ కోసం రిజర్వేషన్ పోరాటసమితిని స్థాపించిన మంద కృష్ణమాదిగ ఆదేశాలను శిరసావహిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబుతో పాటు ప్రధాని మోదీ కూడా అనుకూలంగా ఉన్నట్టు హైదరాబాదు సభ ద్వారా నిరూపణ జరిగిందన్నారు. మంద కృష్ణమాదిగ ఏ నిర్ణయం తీసుకున్నా మొత్తం జాతి భవిష్యత్ ఉన్నతికేనని జయరాజు అన్నారు. కృష్ణమాదిగ కూటమికి మద్దతు ప్రకటించిన కారణంగా మండపేట నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి జోగేశ్వరరావుకు ఎమ్మార్పీఎస్ మద్దతు ఉంటుందన్నారు. జగన్ మాదిగలను మోసం చేశారని ఆరోపించారు. వర్గీకరణ అంశం సుప్రీంకోర్టులో వాదన దశలో ఉంటే ప్రభుత్వం తరఫున న్యాయవాదిని పంపించే బాధ్యతను కూడా జగన్ విస్మరించారన్నారు. మాదిగ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. మాదిగ వ్యతిరేకి జగన్‌ను ఓడించేందుకు మాదిగలు సిద్ధంకావాలని పిలుపు ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ పేరు చెప్పుకుని కొందరు సంఘాలు నెలకొల్పి పబ్బం గడుపుకుంటున్నారని, వారిపట్ల మాదిగలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్ వ్యాఖ్యానించారు. ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డోకుబుర్ర రాజబాబు, రాష్ట్ర సోషల్‌మీడియా ఇన్‌చార్జి గాలింకి నాగేశ్వరరావు, టీడీపీ ఎస్సీసెల్ టౌన్ అధ్యక్షుడు మోరంపూడి సుబ్రహ్మణ్యం, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ నబీ, టౌన్ అధికార ప్రతినిధి అనసూరి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

డస్ట్‌బిన్ పంపిణీ చేసిన వలంటీరుకు మెమో

అల్లవరం, మార్చి 19: దేవగుప్తం పంచాయతీ పరిధిలో డస్ట్‌బిన్ పంపిణీలో పాల్గొన్న వలంటీరుకు పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్ ద్వారా మెమో జారీ చేసినట్టు ఎంపీడీవో కృష్ణమోహన్ తెలిపారు. ఈవిషయమై ఆర్వీవోకు సమాచారం ఇచ్చామన్నారు.

స్వామివారి సింహ వాహనోత్సవం

రావులపాలెం, మార్చి 19: రావులపాలెంలోని శ్రీఅలమేలుమంగ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు నిర్వహిం చారు. సింహ వాహనోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు, గోవిందమాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి చక్రస్నానం మహోత్సవం

ఆత్రేయపురం, మార్చి 19: ఆత్రేయపురంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహోత్సవాలు ముగిసాయి. మంగళవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. గోదావరినదిలో స్వామివారి చక్రస్నానం జరిపించారు. మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులు, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు.

కూటమి విజయానికి ఐక్యంగా పనిచేయాలి: వేగుళ్ల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

రాయవరం, మార్చి 19:సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించేలా బూత్ ఇన్‌చార్జ్‌లు, కుటుంబ సాధికార సారధులు, నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం సోమేశ్వరంలోపార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్‌పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస, టీడీపీ నేతలు నాగదేవర అమ్మిరాజు, రావుల సత్యనారాయణ, కడియాల వెంకటరమణ, గుత్తుల శ్రీనివాస్, శాకా శ్రీనివాస్, కణకాల సత్యనారాయణ, గుత్తి సూరిబాబు, అంబవరపు సత్యనారాయణ, దొంతంశెట్టి ప్రసాద్, గుత్తుల వీరభద్రరావు, దండంగి పైసాదాసు, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, రాజేశ్వరరావు, ఉమా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమలు ఇలాగేనా..


అమలాపురం: నడిపూడిలో సామాజిక భవనం ఎదుట డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం

అమలాపురం రూరల్, మార్చి 19: ఎన్నికల కోడ్ అమలు ఒక్కోచోట ఒక్కో మాదిరిగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్ ఎదురుగా ఉన్నమాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎన్నికల కోడ్‌లో భాగంగా ముసుగు వేశారు. నడిపూడి మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాలు ఎదురుగా నిలువెత్తు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఉన్నా కోడ్ అమలుచేసే అధికారులకు కనిపించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఇంటింటి పంపిణీకి డస్ట్‌బిన్లు సిద్ధం


ఆత్రేయపురం: డస్ట్‌బిన్లను పంచాయతీలకు తరలిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మార్చి 19: స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర ద్వారా ఇంటింటికీ డస్ట్‌బిన్లు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ స్థానిక యంత్రాంగం పంచాయతీలకు డస్ట్‌బిన్లు పంపిణీ చేయడం గమనార్హం. మండలంలోని 17గ్రామాలకు 29,404డస్ట్‌బిన్లను ప్రభుత్వం మండలపరిషత్ కార్యాలయానికి పంపించింది. రూ.18.52 లక్షలు విలువైన డస్ట్‌బిన్లను మండల స్థాయి అధికారులు పంచాయతీలకు మంగళవారం తరలించారు. ప్రభుత్వ బ్రోచర్, డస్ట్‌బిన్లను పంచాయతీల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైనట్టు సమాచారం.

మామిడికుదురు పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ

మామిడికుదురు, మార్చి 19: మామిడికుదురు హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన వసతులు, పరిస్థితుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ చేపట్టిన భద్రత గురించి నగరం ఎస్ఐ పి.సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు 28మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుగుతున్నాయని ఎస్పీ తెలిపారు.

కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

అంబాజీపేట, మార్చి 19: పదో తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి బి.హనుమంతరావు, తహసీల్దారు జె.విమలకుమారి, ఎంఈవో కె.వెంకటేశ్వరరావు పరిశీలించారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు, తొండవరం హైస్కూల్‌లో కేంద్రాలను పరిశీలించారు.

పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

ముమ్మిడివరం, మార్చి 19: పదో తరగతి పరీక్షలు జిల్లాలో రెండో రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. 112 పరీక్షా కేంద్రాల్లో హిందీ పరీక్షకు సంబంధించి మొత్తం 13,141మందికి 18,799మంది హాజరయ్యారు. 341మంది గైర్హాజరయ్యారు. ఆర్జేడీ జి.నాగమణి ఐదు పరీక్షా కేంద్రాలను, డీఈవో ఎం.కమలకుమారి 6పరీక్షా కేంద్రాలను, డీవైఈవో పి.ఫణి 8 కేంద్రాలను, అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సురేష్ 4పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 29 కేంద్రాలను తనిఖీ నిర్వహించారు. ఎక్కడా మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీసు చోటుచేసుకోలేదని జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి తెలిపారు. ముమ్మిడివరంలో పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో మంగళవారం హిందీ పరీక్షకు సంబంధించి 733మందికి 723మంది హాజరయ్యారు. పది మంది గైర్హాజరైనట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ ఎం.రామచంద్రరావు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల సంక్షేమం

పీసీసీ వర్కింగ్ ప్రెసిండెంట్ జంగా గౌతమ్


పి.గన్నవరం: మాట్లాడుతున్న జంగా గౌతమ్

ముమ్మిడివరం, మార్చి 19: పేదల అభ్యున్నతికి, సంక్షేమానికి కృషిచేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని పీసీసీ వర్కింగ్ ప్రెసిండెంట్ జంగా గౌతమ్ పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో నియోజకవర్గ కన్వీనర్ గెద్దం సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సీఎం జగన్ ఇసుకను దోస్తున్నారని, కల్తీ మద్యం వ్యాపారంతో జేబులు నింపుకున్నారని, అవినీతిలో కూరుకుపోయిన ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు మాట్లాడుతూ ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా అంతా కలిసికట్టుగా అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు పెన్మెత్స జగ్గప్పరాజు, వడ్డి నాగేశ్వరరావు, వంటెద్దు వెంకన్నాయుడు, దివి వెంకన్నబాబు, పొత్తూరి శ్రీనివాస్, ముషిణి రామకృష్ణారావు, కుడుపూడి శ్రీనివాసరావు, బొజ్జా ఐశ్వర్య, ముషిణి శివప్రసాద్, అయితాబత్తుల పండుబాబు, సాధనాల రాజాజీ పాల్గొన్నారు.

ఏపీలో రూ.పది లక్షల కోట్లు అప్పు

పి.గన్నవరం, మార్చి 19: చిన్న రాష్ట్రానికి ఇంత పెద్ద కష్టమా... అప్పులు తెచ్చి...బటన్ నొక్కి....వక్తిగత ఖాతాల్లో డబ్బులు వేసి అనంతరం ప్రచారం కోసం ఇంటింటికి పేపర్ పంపిస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు జంగా గౌతమ్ విమర్శించారు. లంకలగన్నవరంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రూ.2లక్షల కోట్లు అప్పు చేస్తే వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో అప్పును కాస్త రూ.పది లక్షల కోట్లుకు పెంచిందన్నారు. వైసీపీ, టీడీపీ, జనసే, బీజేపీ పార్టీలతో రాష్ట్రానికి ప్రయోజనం లేదన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి పాటుపడే కాంగ్రెస్ రావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు మాట్లాడుతూ చివరకు శవాలపై కూడా సీఎం బొమ్మను ముద్రిస్తారేమో అంటూ చలోక్తులు విసిరారు. సమావేశంలో ముఖ్య నాయకులు ఒంటెద్దు బాబీ, మహ్మద్ హరీఫ్, నెల్లి వెంకటరమణ, గెద్దం వెంకటేశ్వరావు, వడ్డి నాగేశ్వరావు, చిట్టాల రామజోగేశ్వరావు, మాచవరపు శివన్నారాయణ, ములపర్తి మోహనరావు, సరోజిని, యడ్ల ఆదినారాయణ పాల్గొన్నారు.

వైభవంగా గోకర్ణేశ్వరస్వామి-జలదుర్గమ్మ కల్యాణం


గోకర్ణేశ్వరస్వామి-జలదుర్గమ్మవారి కల్యాణం ఇం

అంతర్వేది, మార్చి 19: కేశవదాసుపాలెం గ్రామం మెండుపాలెం(చినకొల్లేరు)లో వెలసి ఉన్న కోనసీమ కల్పవల్లి శ్రీపెద్దింట్లమ్మవారి తీర్థ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం అమ్మవారి ప్రభ ఊరేగింపు గ్రామోత్సవం బాణసంచా కాల్పుల నడుమ గరగ నృత్యాలతో బుట్టబొమ్మలు, శక్తివేషాలు, డోలుసన్నాయిలతో కోలాహలంగా జరిగింది. భక్తులు ప్రభ ఊరేగింపు మహోత్సవంలో పాల్గొన్నారు. మంగళవారం రాత్రి 10.30గంటల నుంచి మెండు ఉదయభాస్కరరావు(బుజ్జి)-అన్నపూర్ణ దంపతులు కర్తలుగా గోకర్ణేశ్వరస్వామి-జలదుర్గమ్మవారి కల్యాణం వైభవంగా జరిగింది. అమ్మవారి కల్యాణానికి చింతలమోరి పోడుతోటకు చెందిన గోకర్ణేశ్వరస్వామి ప్రభఊరేగింపుతో పెండ్లి కుమారుడిని తీసుకువచ్చారు. చింతలమోరికి చెందిన భక్తులు మంగళసూత్రం, తలంబ్రాల బియ్యం తీసుకువచ్చారు. అనంతరం చింతలమోరి, గెద్దాడవారిపాలేనికి చెందిన పెండ్లి కుమారునికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు స్వామి-అమ్మవార్ల కల్యాణ తంతు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన కాదా?


భీమనపల్లి సొసైటీకి వైసీపీ రంగులు

ఉప్పలగుప్తం, మార్చి 19: ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గొడౌన్‌కు వేసిన వైసీపీ రంగులు అధికారులకు కన్పించలేదు. కొద్ది రోజుల క్రితం వరకు ఈ గొడౌన్‌ను ఆర్బీకే కేంద్రంగా వాడుకున్నారు. ఎన్నికల అధికారులిచ్చిన వ్యవధి ముగిసినా రంగులు మాత్రం అలానే ఉన్నాయి.

యానాం మద్యం స్వాధీనం

ఉప్పలగుప్తం, మార్చి19: భీమనపల్లి సెంటర్లో మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా చిన్నకారులోఏడు ఫుల్‌బాటిల్స్, 90ఎంఎల్ బాటిల్స్ 192, బీర్‌బాటిల్స్ 96 లభ్యమైనట్టు ఎస్ఐ కె.మనోహర్‌జోషీ తెలిపారు. కారును స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు.

కార్యకర్తలకు రాపాక పరిచయం

రామచంద్రపురం, మార్చి 19: ఎన్నికల్లో వైసీపీకి రెండు ఓట్లు వేస్తే రాజ్యసభ ఎంపీగా తాను, లోక్‌సభ ఎంపీగా రాపాక, ఎమ్మెల్యేగా తన కుమారుడు సేవ చేస్తామని ఎంపీ బోస్ అన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో కార్యకర్తలకు ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌ను పరిచేయం చేశారు.

వైద్యురాలి నిర్లక్ష్యంతో పసికందు మృతి

కుటుంబ సభ్యుల ఆరోపణ

రాజోలు, మార్చి 19: రాజోలు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యురాలి నిర్లక్ష్యంతో పసి కందు మృతిచెందిందని మంగళవారం కడలి మంగ, కుటుంబ సభ్యులు ఆరోపించారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలేనికి చెందిన గర్భిణి కుడుపూడి రాజేశ్వరి ఈనెల14న రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. నెలలు నిండకుండానే నొప్పులు రావడంతో బిడ్డ తయారవ్వడానికి ఇంజక్షన్ చేశానని వైద్యురాలు తెలిపారు. డాక్టర్ సూచనతో గర్భిణి ఆసుపత్రిలో ఉంది. మంగళవారం ఉదయం స్కానింగ్ చేయగా పసి బిడ్డ మృతిచెందినట్టు తెలిసింది. గర్భిణి రాజేశ్వరికి మొదటి కాన్పులో ఆపరేషన్ చేయించుకోవడంతో కుట్లు విడిపోయి ఉండవచ్చని, అందుకే బ్లడ్ సర్క్యులేషన్ ఆగిపోయి పసిబిడ్డ హార్ట్‌బీట్‌ఆగిపోయిందని డాక్టర్ తెలిపారు. ఆపరేషన్ చేయకపోతే తల్లి కూడా ప్రమాద మని కాకినాడ తీసుకువెళ్లాలని డాక్టర్ సూచించారు. దీంతో బంధువులు ఆమెను రాజోలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు ఆపరేషన్ చేయడంతో ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. అయితే ప్రభుత్వాసుపత్రి వైద్యురాలి నిర్లక్ష్యంతో పసికందు మృతిచెందిందని కడలి మంగ, కుటుంబ సభ్యులు ఆరోపించారు.

శాశ్వత విద్యానిధికి రూ.లక్ష విరాళం

అమలాపురం రూరల్, మార్చి 19: కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం శాశ్వత విద్యానిధికి సంఘ అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆధ్వర్యంలో మంగళవారం బండారులంక ఊటుకూరివారి వీధి, వీరభద్రపురం ప్రాంతాల్లో పర్యటించి రూ.1,00,116 విరాళాన్ని సేకరించారు. కాశిన బసవరాజు కుటుంబసభ్యులు రూ.30వేలు, బళ్ల వెంకటేశ్వరరావు, కాశిన వెంకటనాగేశ్వరరావు, యినుమర్తి సత్యానందం, లక్కింశెట్టి హనుమంతరావు రూ.10వేలు చొప్పున విరాళాలను అందజేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు బళ్ల వెంకటేశ్వరరావు, పెద్దలు పిచ్చిక శ్యామ్, చింతపట్ల గంగాసత్యనారాయణ, యినుమర్తి లింగమూర్తి,యినుమర్తి సతీష్, బళ్ల బ్రహ్మాజీ, మాడా పెద్ద, జాన గణేష్, కొండా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సిగల్స్ సిబ్బంది పిల్లలకు నగదు పురస్కారం

యానాం, మార్చి 19: యానాం పర్యాటక శాఖ ఆధీనంలో ఉన్న సిగల్స్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న సిబ్బంది పిల్లలకు పుదుచ్చేరి టూరిజం డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ నగదు పురస్కారం అందించింది. సీగల్స్‌లో పనిచేస్తున్న పంతాడి వెంకట్రావు(బుజ్జి) కుమార్తె పంతాడి దేవహిరినికి రూ.6 వేలు, కుమారుడు పంతాడి తేజష్‌కు రూ.3,500 పరిపాలనాధికారి, సీగల్స్ ఎండీ ఆర్.మునిస్వామి, మేనేజర్ మురళీధరన్ అందజేశారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: మాయ
వెంకటరమణ	: వెయ్ దరువెయ్
శ్రీలలిత	: గామి
శేఖర్ స్క్రీన్-1	: తంత్ర
శేఖర్ స్క్రీన్-2	: హనుమాన్
రమా	: ప్రేమలు
గణపతి	: గుంటూరు కారం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: భీమా
వెంకటపద్మావతి స్క్రీన్-2	: భీమ

పొన్నాడ ప్రచారం

కాట్రేనికోన, మార్చి 19: ముమ్మిడివరం అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ మంగళవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మావుళ్ళమ్మ ఆల యంలో పూజలు నిర్వహించి స్థానిక వ్యాపారి గ్రంధి శ్రీనివాస్‌ను ఓటు అడి గారు. కాట్రేనికోన నుంచి చెయ్యేరు, మహీపాలచెరువు మీదుగా ముమ్మిడివరం ఎయి మ్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, నడింపల్లి సూర్యనారాయణరాజు (సూరిబాబు), ఏడిద సుబ్బి, అక్కల శ్రీధర్, పెన్మెత్స చిట్టిరాజు, మంతెన మమ్మురాజు, గంటి వెంకటసుధాకర్ పాల్గొన్నారు.

తమిళసైకు వీడ్కోలు

యానాం, మార్చి 19: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా రాజీనామా చేసిన తమిళసైకు పుదుచ్చేరిలో ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం పుదుచ్చేరి వచ్చిన గవర్నర్‌ను రాజ్‌నివాస్‌లో సీఎం రంగసామి కలిశారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు జార్ఖండ్ గవర్నర్‌కు అదనపు బాధ్యతలు... పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఝూర్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

టీడీపీ నాయకులను కలిసిన సుభాష్



కె.గంగవరం, మార్చి 19: కె.గంగవరంలో మాజీ ఆత్మ చైర్మన్ అల్లూరి దొరబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు నేమాని అబ్బులను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ కలిశారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిఅభ్యర్థిగా పోటీ చేస్తున్న తన విజయానికి కృషిచేయాలని కోరారు. పార్టీ నాయకులు చుండ్రు వి.వి.ఎస్.ఎస్.చౌదరి, మరివాడ సూరిబాబు, గన్ని దొరబాబు, వాసం శెట్టి కృష్ణ, వెంటూరి వీర్రాఘవులు చౌదరి, దేవరపల్లి బుల్లి, మార్ని శ్రీధర్ పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ పోటీల్లో సాయిదీప్తి విద్యార్థుల ప్రతిభ

మామిడికుదురు, మార్చి 19: నందిగామలో ఈనెల18న జరిగిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో నగరం సాయిదీప్తి స్కూలు విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి చాంపియన్ షిప్‌ను సాధించారు. విద్యార్థులు కొంబత్తుల రోషన్, ఆకుమర్తి అవినాష్, మడిమెట్ల అభిషేక్, ఉండ్రాజవరపు పూజశ్రీ, జక్కంపూడి నాగశ్రీకర్, బిక్కిన రేష్మన్విత, చింతా కల్యాణి, తాడి వర్ధబాబు ప్రతిభ కనబరిచారని హెచ్ఎం గుబ్బల మౌనిక తెలిపారు. టైగర్స్ కుంగ్‌ఫూ కరాటే మాస్టారు మట్టా శ్రీను శిక్షణతో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో రాణించిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల సిబ్బందిని కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జక్కంపూడి శివప్రసాద్ అభినందించారు.

ప్లాస్టిక్ పర్యావరణ ముప్పుపై అవగాహన

అల్లవరం, మార్చి 19: ఓడలరేవు బీవీసీ కళాశాల విద్యార్థులు 60 మంది బెండమూర్లంక శివారు ఆరగట్లపాలెంలో రెండో రోజైన మంగళవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. పాలి థిన్ కవర్ల వాడకాన్ని నిషేధించాలంటూ జనపనార సంచులు పంచారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌ఏ చంద్రమౌళి, మహిళా పోలీసు బి.బేబీకుమారి, అధ్యాపకులు ఎస్వీ సుబ్రహ్మణ్యం, లోవ రాజు, సాయిషణ్ముఖ్ పాల్గొన్నారు.

ద్రాక్షారామ సర్పంచ్ టీడీపీలో చేరిక

ద్రాక్షారామ, మార్చి 19: ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఆమె భర్త కొత్తపల్లి రామారావులు మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రధాని పాల్గొన్న సభపైనా ఇంతా నిర్లక్ష్యమా!


మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు

కొత్తపేట, మార్చి 19: ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, దేశ ప్రధాని పాల్గొన్న సభపైనే ఇంత నిర్లక్ష్యమనా అని కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు విమర్శించారు. కొత్తపేట మండలం వాడపాలెంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని పాల్గొన్న సభలోనే ఇంత నిర్లక్ష్యంగా ఉంటే సాధారణ ప్రజలు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముత్యాల బాబ్జీ, కప్పల సునీల్, యల్లమిల్లి జగన్మోహన్, కాసా సాగర్, బండారు వీరబాబు, చీకరమిల్లి లవరాజు, హనుమంత్ పాల్గొన్నారు.

భద్రతా వైఫల్యంపై విచారణ జరపాలి

రాజోలు, మార్చి 19: ఇటీవల గుంటూరు జిల్లా చిలకలూరిపేట బొప్పూరులో ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొన్న బహిరంగసభ భద్రతా వైఫల్యంపై వెంటనే విచారణ జరపాలని టీడీపీ రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, నియోజకవర్గ బూత్ కమిటీ కోఆర్డినేటర్ చాగంటి స్వామి డిమాండ్ చేశారు. పొన్నమండలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రధాని సభకు సరైన భద్రత ఏర్పాటు చేయలేదని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్రప్రజలకు వైసీపీ ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో చిలకలూరిపేట సభ స్పందన చూస్తే అర్థమవుతుందన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

పి.గన్నవరం, మార్చి 19: ఓటును అమ్ముకోకుండా నిజమైన నాయకుడిని ఎన్నుకోవాలని ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి కోరారు. పి.గన్నవరంలో ఉపాధిహామీ కూలీలకు ఓటు హక్కు వినియోగంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏపీవో సీహెచ్ లక్ష్మీనారాయణ, ఈవోపీఆర్డీ, ఈసీ విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు, మార్చి19: పాశర్లపూడిలోని వీరభద్రస్వామి సంబరాన్ని మంగళవారం భక్తులునిర్వహించారు. స్థానిక శ్రీపాల్లమ్మ ఆలయం నుంచి మేళతాళాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ వైనతేయ నది వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ నదీస్నానమాచరించి పలు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం శమీపూజ, భజనతో పాటు స్వామివారి భక్తులు 60గజాల పొడవుగల నిప్పుల గుండాన్ని తొక్కారు.

చిలకలపాడులో రామాలయం నిర్మాణం

ఆలమూరు, మార్చి 19: చిలకలపాడులో రామాలయం శిథిలావస్థకు చేరడంతో దానిని తొలగించి నూతన ఆలయాన్ని స్థానికులు సర్వాంగసుందరంగా నిర్మించారు. బుధవారం సీతారామ, లక్ష్మణ,హనుమాన్‌విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. వేదపండితుడు బాదంపూడి సత్యనారాయణశర్మ సారథ్యంలో వేదపండితులు రెండు రోజులుగా పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తున్నారు. భక్తులు ప్రతిష్ఠోత్సవాన్ని తిలకించాలని కమిటీ సభ్యులు కోరారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కె.గంగవరం, మార్చి19: యర్రపోతవరంలో మద్యం విక్రయిస్తున్న దండ్రోలు ఈశ్వరరావును అరెస్టు చేసినట్లు పామర్రు ఎస్ఐ జానీ బాషా చెప్పారు. 20మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

తోటను కలిసిన రాపాక

మండపేట, మార్చి 19: ఎన్నికల్లో నియోజకవర్గంలో వైసీపీ విజయం సాధిస్తుందని వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు అన్నారు. స్థానిక విజయలక్ష్మీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో వైసీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు మంగళవారం తోటను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇద్దరు మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దూలం వెంకన్నబాబు, రెడ్డి రాధాకృష్ణ, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ళ పట్టాభిరామయ్యచౌదరి, టౌన్ వైసీపీ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజు, ఎంపీపీ ఉండమట్ల వాసు, జడ్పీటీసీ కె.భవానీరాంబాబు పాల్గొన్నారు.